‘ఉపాధి’తో ‘ఉద్యాన’ వికాసం





ఉపాధి హామీ పథకం కింద నాటిన చీనీ మొక్కలు

పండ్ల తోటల సాగుకు చలో చలో

- ఉపాధి హామీ ద్వారా వంద శాతం సబ్సిడీ
- గత ఐదేళ్లలో ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో 12,400 హెక్టార్లలో సాగు
- చౌడు భూముల్లోనూ పండ్ల తోటల సాగుకు అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం

పండ్లతోటల సాగు అంటే లక్షల్లో వ్యవహారం. ఆర్థిక వనరులు, కూలీల లభ్యత ఉండాలి. నీటి వనరులు సమృద్ధిగా ఉండాలి. భూములు సారవంతంగా ఉండాలి. ఫలితంగా పెద్ద రైతులే పండ్ల తోటలకు సాగుచేసేవారు.ఇది ఒకప్పటిమాట. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం అండతో మెట్ట రైతులు కూడా పండ్లతోటలు సాగు చేయవచ్చు. అవసరమైన ఆర్థిక సాయం ప్రభుత్వమే అందజేస్తుంది. చౌడు భూముల్లోనూ అద్భుతమైన పంటలు సాగు చేయవచ్చు.

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పండ్ల తోటల అభివృద్ధితో పాటు పచ్చదనం పెంపునకు జిల్లా నీటి యాజమాన్యం ఆధ్వర్యంలో చర్యలకు ఉపక్రమించారు. ఇటీవల వర్షాలు సంవృద్ధిగా కురుస్తుండడంతో మొక్కలు నాటేందుకు చక్కటి అవకాశం ఏర్పడింది. అందులో భాగంగా పండ్ల తోటలు సాగు చేసుకునే రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు చేసుకొని జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందిన వెంటనే గుంతలు తవ్వడం, మొక్కలు నాటే పనులు చేపట్టడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

వంద శాతం సబ్సిడీ

పండ్ల తోటల సాగుతో కరువును తరిమికొట్టడమే కాకుండా రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో పండ్ల తోటల అభివృద్ధికి విశేషంగా ప్రోత్సాహకాలను అందించారు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో 12,400 హెక్టార్లలో వివిధ రకాలు పండ్ల తోటలు సాగయ్యాయి. ఈ ఏడాది 2024–25 సంవత్సరంలోనూ ఉపాధి హామీ పథకం కింద 100 శాతం సబ్సిడీతో పండ్ల తోటలను అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పిస్తోంది. ఐదు ఎకరాల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు సన్న, చిన్నకారు రైతులు కూడా అర్హులే. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్‌తో పాటు భూమి పట్టాదారు పాసుపుస్తకం ఉంటే పండ్ల తోటల సాగుకు వంద శాతం సబ్సిడీ లభిస్తుంది.

అన్ని రకాల తోటల అభివృద్ధికి అవకాశం

ఉపాధి హామీ పథకం కింద అన్ని రకాల పండ్ల తోటలను అభివృద్ధి చేసుకోవచ్చు. 100 శాతం సబ్సిడీతో గులాబీ, మల్లె తోటలతో సహా 17 రకాల పండ్ల తోటల అభివృద్ధికి అవకాశం వుంది. ఎక్కువగా దీర్ఘకాలిక పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తారు. మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, కొబ్బరి, సీతా ఫలం, చింత, రేగు, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్స్, అంజూర, పూల తోటలకు సంబంధించి గులాబీ, మల్లె తోటలను అభివృద్ధి చేసుకోవచ్చు. మునగ, మల్లే, గులాబీ, రేగు తోటలకు మెయిన్‌టెన్స్ బిల్లులు రెండేళ్లు కాగా మిగిలిన వాటికి మూడేళ్ల పాటు బిల్లులు చెల్లిస్తారు.

నీటి వసతి లేకపోయినా అవకాశం

- గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పండ్ల తోటల అభివృద్ధికి నీటి వసతి కచ్చితంగా ఉండాలనే నిబంధన లేదు.
- మెట్ట భూములు, చౌడు భూముల్లో కూడా పండ్ల తోటలను అభివృద్ధి చేసుకోవచ్చు.
- రైతులు తమ పరిసర ప్రాంతాలలో చెరువు లేదా కాలువలు, డగౌట్ పాండ్‌లు, ఇతర నీటి సదుపాయం ఉన్నా పండ్ల తోటలకు అర్హులే.
- ఏదో విధంగా వేసవిలో మొక్కలను బతికించుకోవాలి. అందుకు ఉపాధి హామి పథకం కింద నీటి బిల్లులు చెల్లిస్తారు. దీనినే డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం అని కూడా అంటారు.
- సాధారణంగా చౌడు నేలలను పనికి రాని నేలలుగా వ్యవహరిస్తారు.
- ఉపాధి కింద చౌడు నేలల్లోను సీతా ఫలం, నేరేడు, జామ, సపోట మొక్కలు నాటుకోవచ్చు. అయితే సమీపంలో నీటి వసతి తప్పనిసరి. మిగిలిన తోటల అభివృద్ధికి బావి లేదా బోరు ఉండాలి.

మూడేళ్లలో ఎకరాకు చెల్లించే సబ్సిడీ ఇలా

పండ్లతోటలు	చెల్లించే మొత్తం
మామిడి	రూ. 99,911
చీనీ	రూ. 1,26,702
నిమ్మ	రూ. 1,33,911
జామ	రూ. 1,35,288
సీతాఫలం	రూ. 1,90,114
దానిమ్మ	రూ. 1,96,019
గులాబి	రూ. 1,90,000
మల్లె	రూ.144,072
నేరేడు	రూ.61,793
చింత	రూ. 60,999
అంజూర	రూ. 1,66,997
మునగ	రూ. 91,776

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్న కారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హత వున్న రైతులు పండ్ల తోటలు, పూల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలి. అనుమతులు మంజూరైన వెంటనే పొలాల్లో మొక్కలు నాటుకోవడానికి ఉపాధి హామీ పథకం కింద కూలీల ద్వారా గుంతలు తవ్వుకునేందుకు అనుమతి ఇస్తాం.

అనీల్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ, ధర్మవరం మండలం

క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం

నల్లచెరువు: మండల పరిధిలోని చిన్నపల్లోల్లపల్లి వద్ద జాతీయ రహదారిలో డివైడర్‌పై ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. కింద నుంచి కొద్ది అడుగులపైన స్తంభం శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉంది. జాతీయ రహదారిపై రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. స్తంభం కూలితే పెను ప్రమాదం జరిగి ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదముంది. అధికారులు స్పందించి స్తంభాన్ని మార్పు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రాయితీతో విత్తన కందుల పంపిణీ

తాడిమర్రి: మండల కేంద్రంతో పాటు నార్శింపల్లి, ఎం.అగ్రహారం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం వ్యవసాయ అధికారులు రైతులకు సబ్సిడీ విత్తన కందులు పంపిణీ చేశారు. 40 శాతం సబ్సిడీతో యల్ఆర్జీ 52 రకం కిలో రూ.98 ప్రకారం నాలుగు కిలోల బ్యాగును రూ.392తో 49 మంది రైతులకు 8 క్వింటాళ్ల విత్తన కందులు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైనది



బయారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

తలుపుల: గజ్జలప్పగారిపల్లిలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన బయారెడ్డిని మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు వెంకట్రాముడు, విజయకుమార్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిని సక్రమంగా నిర్వర్తించి ఎంతో మందిని విద్యావంతులు చేసిన ఘనత బయారెడ్డికి దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడిమర్రిలో మోస్తరు వర్షం

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రితో పాటు నిడిగల్లు, శివంపల్లి, మరవపల్లి, మద్దులచెర్వు, మోదుగులకుంట, పెద్దకోట్ల, పుల్లానారాయణపల్లి తదితర గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో 16.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు ఏఎస్ఓ సౌమ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్ వేరుశనగ సాగుకు వర్షాలు అనుకూలంగా కురుస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెరిట్ విద్యార్థినికి నగదు ప్రోత్సాహం



నాగశ్రీ తల్లిదండ్రులకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న ప్రొఫెసర్ రాజేష్

కనగానపల్లి: మండలంలోని చంద్రాచర్లకు చెందిన రైతు నాగభూషణ్ కుమార్తె నాగశ్రీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివి 576 మార్కులు సాధించింది. మండల టాపర్‌గా నిలిచిన నాగశ్రీకి దాత ప్రొఫెసర్ రాజేష్ రూ.50 వేల నగదు ప్రోత్సాహం అందించారు. ఇందులో భాగంగానే మంగళవారం వారి గ్రామానికి వెళ్లి విద్యార్థినితో పాటు వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో రాజేష్ ఎడ్యుకేషనల్ బృందం సభ్యులు సుబ్రమణ్యం, ఆదినారాయణ, గ్రామస్తులు ముత్యాలు, రమేష్, రమణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం పెంపుపై హర్షం

కదిరి అర్బన్: వయో, వైద్య కారణాలతో ఉద్యోగ విరమణ చేసి చనిపోయిన ఆర్టీసీ ఉద్యోగుల నామినీ కుటుంబాలకు అంత్యక్రియల ఖర్చులకు అందించే మొత్తాన్ని రూ. 25 వేలకు పెంచుతూ సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేయడంపై ఉద్యోగులు మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2022 జనవరి 1 తర్వాత మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. ఇప్పటికే రూ.15వేలు ఇస్తుండగా అదనంగా మరో రూ. 10 వేలు ఆర్టీసీ నిధులు ఇవ్వాలని జీవో నెంబర్ 6–24 ఉందని ఎన్ఎంయూ నాయకులు హరిమోహన్, బైరెట్టి, ఎస్వీ రమణ, గోపాలక్రిష్ణ తెలిపారు.

పెద్దకోట్ల చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



చౌడేశ్వరి అమ్మవారు

తాడిమర్రి: పెద్దకోట్ల గ్రామంలో కొలువైన చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు బంగారు, వెండి ఆభరణాలు తొడిగి వివిధ పుష్ప మాలలతో అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, పుష్పాంజలి తదితర పూజలు చేశారు. పెద్దకోట్ల, గుడ్డంపల్లి గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



అలంకరణలో గంగమ్మ

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో గంగమ్మ జాతరను మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు ప్రత్యేకంగా జ్యోతులు, బాణాలను అమ్మవారికి సమర్పించారు. మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, నాయకులు ప్రసాద్‌రెడ్డి, బయ్యపురెడ్డి నివాసాల్లో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఎమ్మెల్సీ మంగమ్మ, సర్పంచ్ అశ్వర్థనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, రామ్మోహన్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

మడకశిర: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కిట్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 100 పడకల ఆస్పత్రి భవనాల పనులను కూడా పరిశీలించారు. తర్వాత ఆర్‌అండ్‌బీ బంగ్లాలో అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. సమస్యలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. తదనంతరం పట్టణంలోని దినసరి మార్కెట్‌ను, ఓ ప్రైవేట్ డెయిరీని కూడా పరిశీలించారు.

కేన్సర్‌పై అవగాహన కల్పించాలి



కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ నివేదిత

హిందూపురం టౌన్: ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తీసుకురావాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమాల జిల్లా అధికారిణి డాక్టర్ నివేదిత సూచించారు. పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జరుగుతున్న కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ శిబిరంలో వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీల హాజరు పట్టికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నివేదిత మాట్లాడుతూ కేన్సర్‌ను నివారించడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. శిక్షణ పొందిన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, గ్రామాలలో ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. తొలిదశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి కాపాడుకోవచ్చన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న వారికి శిక్షణకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాధుర్య, డాక్టర్ శశిరేఖ, హెచ్ఓ వన్నప్ప, సూర్యశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టులకు ఘన సన్మానం



జర్నలిస్టులు కోలా వెంకటరమణ, ఉదయం రమణలను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి: ‘హరితనేస్తం’ పేరుతో స్థానిక ఫారెస్ట్ ఉద్యోగి రాయసం హరిప్రసాద్ కొన్నేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ పత్రికల్లో పని చేస్తున్న సీనియర్ జర్నలిస్టులతో పాటు గతంలో పని చేసిన సీనియర్ పాత్రికేయులను మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హరితనేస్తం ఆధ్వర్యంలో సన్మానించారు. సమాజం కోసం పాత్రికేయులు చేస్తున్న సేవలను పలువురు కొనియాడారు. తన కుటుంబాన్ని సైతం పక్కనబెట్టి ప్రజల కోసం పనిచేస్తున్న ఏకైక వ్యక్తి జర్నలిస్ట్ అని కొనియాడారు. కరోనా విపత్తు సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవ చేసిన వారిని హరితనేస్తం గతంలో సన్మానించిందన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్మారెడ్డి, బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివ శంకర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు ఫక్రుద్దీన్, ఆర్టీసీ ఉద్యోగి హరిమోహన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం లియాఖత్ పాల్గొన్నారు.

ఘనంగా దండు మారెమ్మ విగ్రహ ప్రతిష్ట



దండు మారెమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన దండు మారెమ్మ అమ్మవారి సింహ వాహన విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారి సింహ వాహన విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేయగా.. తర్వాత కలశారాధన, నవగ్రహ, మృత్యుంజయ హోమాలను నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేపట్టారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి

పెద్దిరెడ్డిపల్లిలో మంగళవారం నిర్వహించిన దండు మారెమ్మ అమ్మ వారి సింహ వాహన విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ సాకమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మారుతీరెడ్డి, స్థానిక నాయకులు బీఆర్ నారాయణ, రాజేష్, ప్రభాకర్, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ రవి



బత్తలపల్లిలో విద్యార్థుల ర్యాలీ

గాండ్లపెంట: బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండేలా చూడాలని అధికారులు సూచించారు. ‘నేను బడికి పోతా’ కార్యక్రమం అమలుపై ఎంఈఓ శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో మండలస్థాయి కమిటి సమావేశం జరిగింది. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీఓ, సచివాలయ విద్య, సంక్షేమ కార్యదర్శులు హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ ప్రతి ఇంటినీ సందర్శించి బడి ఈడు పిల్లలు, బడి బయట ఉండే 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల పిల్లలను గుర్తించి విద్యా అవశ్యకతను తల్లిదండ్రులకు తెలియజేసి పిల్లలను పాఠశాలలో చేర్పించేలా అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమాన్ని వచ్చే నెల 12వరకు ఎన్యుమరేటర్‌లు కొనసాగించాలన్నారు. ఎంపీడీఓ రామానాయక్, పాఠశాల సముదాయ చైర్మన్ మధురాంబ పాల్గొన్నారు.

పుట్టపర్తి: నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బుక్కపట్నంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ గోపాల్‌నాయక్, బాల, బాలికల ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు జగదీశ్వర్, రహిమాన్, ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పేలా తల్లి దండ్రులు, పాఠశాల సిబ్బంది కృషి చేయాలని సూచించారు.



బత్తలపల్లిలో విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చిస్తున్న ఎంఈఓలు

బత్తలపల్లి: బడి ఈడు వయసు కలిగిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే తప్పకుండా విద్య నేర్చుకోవాలని ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్‌లు తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక విద్యార్థులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బడి బయట పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీడీపీఓలు, పోలీసులు, కార్మికశాఖ అధికారులు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

పెనుకొండ: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఏ గ్రామంలోనూ బాల్య వివాహాలు జరగకుండా ప్రతి అంగన్‌వాడీ ఉద్యోగులు చూడాలన్నారు. బాల్య వివాహం జరిగితే ఆ ప్రాంత అంగన్‌వాడీ కార్యకర్తే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. అదే విధంగా సెంటర్లలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని సబ్‌కలెక్టర్ సూచించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

రొళ్ల: అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపుతప్పి కింద పడిన ఘటనలో మూర్తప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే... మడకశిరకు చెందిన మూర్తప్ప పని మీద ద్విచక్ర వాహనంలో మంగళవారం రొళ్ల వైపు వస్తుండగా పట్టణ సమీపంలోని జాతీయ రహదారిలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన మూర్తప్పను రత్నగిరి ఆపదమిత్ర, వలంటీర్ పరమేష్ మానవతా దృక్పథంతో తన ద్విచక్ర వాహనంలో రొళ్ల సీహెచ్‌సీకి తరలించాడు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వర్షం జోరు.. అన్నదాత హుషారు



గుడిబండ: భారీ వర్షాలకు కొంకల్లు చెరువులోకి చేరుతున్న నీరు



అమరాపురంలో భారీ వర్షం



మడకశిరలో కురుస్తున్న వర్షం

సాక్షిబృందం: మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అమరాపురం, గుడిబండ మండలాల్లో మంగళవారం వర్షం దంచి కొట్టింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పారాయి. కొన్ని ప్రాంతాల్లో పంట పొలాల్లో భారీగా నీరు నిలిచింది. మరో వైపు పెనుకొండ నియోజకవర్గంలోని పరిగి మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో వర్షం ధాటికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. నైరుతి రుతుపవనాల రాకతో జోరుగా వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు సంతోషంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.